
Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.com | సంపుటి :1 | సంచిక: 340 | హైదరాబాద్ | ఆదివారం | 25 -08 - 2024 | పేజీలు: 8 | రూ.3/-

## తెలంగాణ పోరాట యోధుడు స్వర్గీయ దాశరథి రంగాచార్యకు రేవంత్ రెడ్డి నివాళులు...



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ, ఆగస్టు 24:** సాహితీవేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు స్వర్గీయ దాశరథి రంగాచార్య జయంతి సందర్భంగా ఆ బహుభాషా కోవిదుడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఢిల్లీలోని అధికారిక నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దాశరథి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొనడమే కాకుండా నాటి పరిస్థితులపై అనేక రచనలతో దాశరథి రంగాచార్య తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. వేదాలను తెలుగులోకి అనువదించడం వంటి విప్లవాత్మక చర్యలతో దాశరథి రంగాచార్య చరిత్రలో తనదైన ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## రాష్ట్రంలో హైడ్రా పేరుతో హైడ్రామా

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24:** రాష్ట్రంలో హైడ్రా పేరుతో హైడ్రామా నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వమే ఇప్పుడు కూల్చివేతలు చేస్తోందని ఆరోపించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'హైడ్రామాకు భాగ్యనగరం కేరాఫ్‌గా మారింది. నిర్మాణాలు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చిన వారే నేడు అక్రమ కట్టడాలని కూల్చేస్తూ డ్రామాలాడుతున్నారు. అప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారు? విద్యుత్, నీరు, రోడ్ల సదుపాయాలు ఎలా కల్పించారు? ఇప్పుడు అవన్నీ కూడా లోతుగా చర్చించాల్సిందే. ప్రభుత్వం తీసుకున్న ఏ నిర్ణయమైనా అందరికీ సమానంగా వర్తింపజేయాలి. ఇష్టం వచ్చినట్లు చేస్తామనడం సరికాదు. గతంలో అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంచి ఉద్దేశంతో హైడ్రా ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ చెబుతోందని.. అదే నిజం అయితే ముందు బీఆర్ఎస్ నేతలు ఆక్రమించి కట్టిన భవనాలను కూల్చివేయాలంటూ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫామ్ హౌస్‌లు కూల్చడానికి

వివరాలు 2లో

## ఆర్టీసీలో త్వరలోనే ఉద్యోగ నియామకాలు

- త్వరలోనే నూతన బస్సులు కొనుగోలు
- ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి పొన్నం

2లో




## ఇప్పటికే మహిళలకు క్షమాపణలు చెప్పాను: మాజీ మంత్రి కేటీఆర్



**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24:** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందిగా తెలంగాణ మహిళా కమిషన్ నోటీసు లు జారీ చేసిన విషయం తెలిసిందే. నేడు మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరైన కేటీఆర్ కమిషన్ ఎదుట జరిగిన పరిణామా లను మీడియాకు వివరించారు. తాను వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరైనని తెలిపారు. నేను యధాలాపంగా చేసిన వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే అందుకు తాను విచారం వ్యక్తం చేస్తున్నానని నేను చేసిన వాక్యాలను అంగీకరించినట్టు తెలిపారు. ఇప్పటికే ఆ విషయంపై మహిళలకు క్షమాపణ చెప్పినట్లు గుర్తుచేశారు. అయితే నేను చట్టాన్ని గౌరవించి మహిళా కమిషన్ ఎదుట హాజరవడానికి తాను వస్తే కాంగ్రెస్ మహిళా నేతలు జనాన్ని వెంటవేసుకొని వచ్చి తన వెంట వచ్చి న మహిళా ప్రజాప్రతినిధుల పై దాడి చేయడం బాధాక రం అన్నారు. తాను మహిళా కమిషన్ ఎదుట విచారణలో ఉండగా భవనం బయట ఉన్న బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ మహిళా నేతలు దాడి చేశారని ఆరోపించారు. నెయిల్ కట్టర్స్‌తో దాడికి పాల్పడినట్లుగా బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు తన వద్ద వాపోయారని అన్నారు. పోలీసుల అండ దండలు చూసుకుని కాంగ్రెస్ నేతలు ఈ దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.



## ఎస్సీ, ఎస్టీ చట్టం వాటికి వర్తించదు: సుప్రీంకోర్టు

**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24:** ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ప్రజల్ని కులం పేరు ఎత్తకుండా బెదిరించిన, అవమానించిన నేరానికి ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం-1989 కింద కేసు పెట్టలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.కులంపేరుతో అవమానించినప్పుడు, వేధించినప్పుడు మాత్రమే చట్టంలోని సెక్షన్ 3(1) R వర్తిస్తుందని తేల్చింది.

## ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలు ఆపండి

### - హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



2లో

## ఎన్-కన్వెన్షన్ నేలమట్టం..

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24:** మాదాపూర్లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు. ఈమేరకు శనివారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. "తుమ్మడికుంట ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలోని ఆక్రమణలు హైడ్రా, జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. తుమ్మిడికుంటలోని అనధికార నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ ఒకటి. చెరువులోని ఎఫ్టీఎల్లో ఎకరా 12 గుంటలు, బఫర్ జోన్ పరిధిలోని 2 ఎకరాల 18 గుంటల్లో ఎన్ కన్వెన్షన్ నిర్మించారు. ఈ నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు లేవు. బీఆర్ఎస్ కింద అనుమతుల కోసం ఎన్ కన్వెన్షన్ ప్రయత్నించింది. సంబంధిత అధికారులు బీఆర్ఎస్కు అనుమతించలేదు" అని రంగనాథ్ వివరించారు.





## మా నిధులు ఏపీ ఖాతాల్లో వేశారు..

### కేంద్ర ఆర్థిక మంత్రికి భట్టి విజ్ఞప్తి

**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24 :** ఢిల్లీ పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్తో భేటీ అయ్యారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా AP నుంచిTGకి రావాల్సిన నిధులు విడుదల చేసేలా చూడాలని కోరారు.మొత్తం 8 అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని భట్టి వివరించారు. త్వరలోనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార మార్గం చూపిస్తామని నిర్మల చెప్పినట్లు పేర్కొన్నారు.**తెక్కలు తీస్తున్నాం.. తాట తీస్తాం:** హైడ్రా కూల్చివేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. చెరువులు ఆక్రమణలకు గురికాకూడదనే హైడ్రా ఏర్పాటు చేశామని హైడ్రా ఏర్పాటును ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రతి పనికి నోటీసులు ఇచ్చాకే చర్యలు తీసుకుంటున్నామని, 2014 నుంచి 2023 మధ్య చెరువులు భారీగా ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఈ ఆక్రమణల వెనుక పెద్ద పెద్ద వ్యక్తులు, వ్యవస్థలు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆక్రమించిన వారితో పాటు వారికి సహకరించిన వారిని వదిలేది లేదన్నారు. ఇప్పటికే శాటిలైట్ ఫోటోలు ఇవ్వాలని అధికారులను ఆదేశించామని సంవత్సరాల వారీగా డేటా మొత్తాన్ని ప్రజల ముందు ఉంచుతామన్నారు. 2014కు ముందు నగరంలో చెరువులు ఎలా ఉన్నాయి? ఆ తర్వాత ఎంత ఆక్రమణకు గురయ్యాయో వివరిస్తామన్నారు. ఇందులో అధికార పార్టీనా, ప్రతిపక్ష పార్టీనా అనే అంశం కాకుండా ప్రజలకు చెందిన నగరాన్ని, చెరువులను కాపాడటం ప్రభుత్వం బాధ్యత అన్నారు.

## మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్..!




**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24:** మెట్రోస్టేషన్ల వద్ద పెయిడ్ పార్కింగ్ అమలు చేయడంపై మెట్రో అధికారులు మరోసారి వెనక్కి తగ్గారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు పెయిడ్ పార్కింగ్ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద ఫ్రీ పార్కింగ్ సదుపాయం పునరుద్ధరించాలని రేపు నాగోల్లో ప్రయాణికులు మహాధర్నా చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



**తెలంగాణ వీణ/హైదరాబాద్:ఆగస్టు 24:** హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. కేంద్రంలోని బీజేపీ వక్ఫ్ బోర్డుచట్టాన్ని సవరించి మార్పులు చేయాలను కుంటోంది. ముఖ్యమంత్రితో మజ్లిస్ అధినేత సమావేశమ య్యారు. వక్ఫ్ బోర్డు అంశంపై చర్చించారు. సీఎంను కలిసిన వారిలో అసదుద్దీన్‌తోపాటు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ ఉన్నారు.

# వయనాడ్ బాధితులకు సీతక్క పరామర్శ

- 20లక్షల చెక్కు స్థానిక ఎమ్మెల్యేకు అందచేత



**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24 :** ఆపదలో ఉన్నామంటే నేనున్నాంటూ ఆదుకునే మంత్రి సీతక్క మరోసారి తన మంచి మనస్సును చాటుకున్నారు. ఇటీవల ప్రకతి భీభత్సానికి అతలా కుతులమైన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితులకు ఆమె ఆర్థిక సహాయం చేశారు. వయనాడ్ జిల్లాలో శనివారం మంత్రి సీతక్క పర్యటించారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌తో కలిసి ఆమె ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ప్రకృతి ప్రకోపానికి గురైన వయనాడ్ బాధిత కుటుంబాలను ఆదుకోవడం కోసం ఆమె సేకరించిన రూ.20 లక్షల చెక్‌ను స్థానిక ఎమ్మెల్యే టి సిద్దికికి అందించారు. చెక్‌తో పాటు దుస్తులు, నిత్యావసర వస్తువులను బాధితులకు అందజేశారు. కొండచరియల కింద పడి గుర్తు పట్టలేనంతగా మారిపోయిన వందల మృతదేహాలను సాముహిక ఖననం చేసిన ముండక్కై స్మశాన వాటికలో మృతులకు సీతక్క శ్రద్దాంజలి ఘటించారు.కొందరు మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. కాగా, ఇటీవల వయనాడ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రకృతి విలయతాండవం సృష్టించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు, వరదలు పలు ప్రాంతాలను ముంచెత్తగా.. కొండ చరియలు విరిగిపడి కొన్ని గ్రామాలకు గ్రామాలే నేలమట్టం అయ్యాయి. ఈ విషాద ఘటనలో దాదాపు 400 మందికి పైగా మృతి చెందగా.. వెయి మందికి పైగా గాయాలపాలయ్యారు. ప్రకృతి భీభత్సం వల్ల కొన్ని వందల కుటుంబాల గూళ్లు చెదిరిపోయాయి.

# ఆర్టీసీలో త్వరలోనే ఉద్యోగ నియామకాలు

- త్వరలోనే నూతన బస్సులు కొనుగోలు
- ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి పొన్నం




**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24 :** ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు చేపడుతామని, తర్వలోనే 3035 ఉద్యోగాలను కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ లో టీజీఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగి మరణిస్తే రూ. కోటి బీమా ఇచ్చేలా ఎంవోయూ చేసుకుంటుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు రానివ్వకుండా, ప్రభుత్వం త్వరలోనే నూతన బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రజలకు అందించడంలో ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఆర్టీసీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు ఆర్టీసీని పట్టించుకోలేదన్నారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగుల్లో పోటీతత్వం రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ ఎం సంపత్ కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఆ తర్వాత ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో సంస్థకు అదృష్టలక్ష్మి వచ్చిందన్నారు. కొత్త బస్సులు కొంటున్నామని.. త్వరలోనే నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లకాలంలో ముందస్తుగా దృష్టిలో పెట్టుకొని బస్సులు, రెండోసారి నియామకాలు చేపడుతున్నామన్నారు. 259వ రోజు 81 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.2750 కోట్ల విలువైన ప్రయాణాన్ని తెలంగాణ అక్కాచె÷-లలెల్లకు అందించామన్నారు. వ్యక్తిగతంగా డ్రైవర్, కండక్టర్, అధికారిగా, మంత్రిగా ఇది సంతృప్తి ఇచ్చే అంశమన్నారు. ఇంటర్నల్ ట్రాన్స్పరెన్సీని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. అత్యున్నంగా పని చేసిన వారికి అవార్డులు ఇస్తూ సన్మానం చేసుకుంటున్నామని.. మిగతా వారికి అవార్డులు పొందాలని పోటీతత్వం రావాలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌లో ఎలాంటి రిమార్క్ లేని డ్రైవర్లను జోనల్ వారీగా సన్మానం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం తరుపున ఆర్థిక పరమైన అంశాలు ఉన్నపటికీ కార్మికుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయి నుంచి ఆలోచిస్తున్నామన్నారు. బాండ్స్ రూ.80కోట్ల పెమెంట్స్ జరిగాయని.. రూ.200కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. దానికి నిధులు తీసుకొచి.. చెల్లించే బాధ్యత మాదన్నారు. రాఖీ పండగ రోజున 17 కోట్ల ప్రయాణాలు జరిగాయన్నారు. దాంతో రికార్డు స్థాయిలో రూ.14.90 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రికార్డు స్థాయిలో 64 లక్షల మంది ప్రయాణం చేశారన్నారు. ఇది సిబ్బంది కృషితోనే జరిగిందన్నారు. ఆర్టీసీలో ఉద్యోగి ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.కోటి బీమా ఇచ్చేలా యూనియన్ బ్యాంక్‌తో ఎంవోయూ చేసుకున్నామన్నారు. ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ. ఉద్యోగులు బాధ్యత పనిచేసి, ఆర్టీసీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంత రం ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలను అందజేశారు.

# రాష్ట్రంలో హైడ్రా పేరుతో హైడ్రామా

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు వెనకాడుతున్నారో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి భయపడు తున్నారని ఎంపీ రఘునందన్ విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కబ్జాలు పెరిగాయని, కేసీఆర్ హయాంలో ఆక్రమ ణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఎందుగా జన్వాడలో కేటీఆర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఫామ్ హౌస్ కూల్చి వేయాలంటూ ఆయన కాంగ్రెస్‌కి సవాల్ విసిరారు. కబ్జాలు చేసిన నేతలపై కేసులు పెట్టామని అధికార పార్టీ నేతలు చెప్తున్నారని, అదే నిజమైతే వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని ఎంపీ ప్రశ్నించారు.

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలు ఆపండి

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24 :** ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వెంటనే కూల్చివేతలు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మాదాపూర్ లోని తుమ్మిడి చెరువును కబ్జా చేసి ఎన్ కన్వెన్షన్ నిర్మించారనే ఫిర్యాదులతో శనివారం ఉదయం హైడ్రా కూల్చి వేతలు ప్రారంభించింది. హైడ్రా చర్యపై ఎన్ కన్వెన్షన్ యజమాని ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్ పై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పి.శ్రీరఘురామ్ వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా అంశాలు కోర్టు దృష్టికి తీసుకువచ్చా రు. ఎన్ కన్వెన్షన్ ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేద ని పూర్తిగా పట్టాభూమి లోనే నిర్మాణాలు చేపట్టిందని కోర్టుకు వివరించారు. గతంలోనే ఎన్ కన్వెన్షన్ ఆక్రమణలకు పాల్పడిందని నోటీసులు ఇస్తే దానిపై హైకోర్టును ఆశ్రయించా మని ఆ సమయంలో స్టే కూడా ఉందని ఆ స్టే నోటీ సులను లెక్క చేయకుండా తాజా కూల్చివేతలపై ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కన్వెన్షన్ హాల్ ను కూల్చివే శారని వాదించారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిం చారని కోర్టుకు తెలుపగా వాదనలు విన్న న్యాయ స్థానం కూల్చివేతలను ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇవాళ ఉదయం ఎన్ కన్వెన్షన్ హాల్ ను కూల్చి వేసిన హైడ్రా అధికారులు ఆ పరిసర ప్రాంతాల్లో తుమ్మిడి చెరువును ఆక్రమించుకుని చేపట్టిన మరికొన్ని నిర్మాణా లను సైతం కూల్చివేస్తు న్నారు. ఈ క్రమంలో హైకోర్టు ఈరోజు మధ్యాహ్నం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం హాట్ టాపిక్ గా మారింది.

# ప్రజాస్వామ్యానికి సవాలుగా మావోయిస్టుల హింస

- ఇప్పటివరకు 17 వేలమంది తీవ్రవాదానికి బలి
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి



**తెలంగాణ వీణ/రాయ్‌పుర్,ఆగస్టు 24 :** మావోయిస్టుల హింస ప్రజాస్వామ్యానికి సవాలుగా మారిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పటివరకు 17 వేలమంది దీనికి బలయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నక్సల్స్ అంతానికి బలమైన, పకడ్బందీ వ్యూహం అవసరమన్నారు. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2004-14 వ్యవధితో పోలిస్తే 2014-24 మధ్యకాలంలో నక్సల్స్ సంబంధిత ఘటనల్లో 53 శాతం తగ్గుదల నమోదైనట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. ఏకకాలంలో భద్రతా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు మావోయిస్టు హింస నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు.

# తప్పంతా కేటీఆర్‌దే..: బీజేపీ ఎంపీ



**తెలంగాణ వీణ/హైదరాబాద్:ఆగస్టు 24 :** మున్సిపల్ మంత్రిగా పదేళ్లు పాటు పరిపాలన చేసిన పాపాల ప్రతిఫలమే ఈరోజు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వెలుగు చూస్తన్న అక్రమ కట్టడాలని బీజేపీ ఎంపీ రఘునందన రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ కన్వెన్షన్ కూలగొట్టాలని హైకోర్టు 2014లో ఉత్తర్వుల ఇచ్చనా మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ పట్టించుకోలేదన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. నగరంలో ఎన్నిచెరువులు దురాక్రమణకు గురయ్యాయో కేటీఆర్‌కు తెలుసునన్నారు. అయినా పట్టించుకోకుండా అక్రమార్కుల కొమ్ముకాశారన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కేసు..

**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24 :** ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లాలోని వెంకటాపురంలో చెరువు బఫర్ జోన్లో అనురాగ్ యూనివర్సిటీ నిర్మించారని ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. నాదం చెరువు పూర్తిగా కబ్జాకు గురైందని ఆరోపించారు. దీంతో పోచారం ఐటీ కారిడార్ పీఎస్ లో కేసు నమోదైంది.

# కొత్త రేషన్ కార్డుల జారీకి కసరత్తు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:ఆగస్టు 24 :** కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి వడివడిగా అడుగులు పడుతున్నా యి. ప్రస్తుత కార్డుదారుల్లో అనర్హులను మరణించినవారి వివరాలను తొలగించి కొత్త పేర్ల నమోదుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్త రేషన్‌కార్డుల జారీకి పూర్తి విధివిధానాలు ఖరారు కానున్నాయి. ఒక్కో సర్కిల్‌లో సుమారు 20వేల వరకు కొత్త పేర్ల నమోదుకు సంబంధించి అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం హైదరాబాద్‌లో 2.8 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరిలో 34వేలు, రంగారెడ్డి జిల్లాలో 87వేల మంది దరఖాస్తు చేశారు.వీరిలో అర్హులను గుర్తించి కార్డులు అందజేయడం లేదా కొత్తగా దరఖాస్తులను ఆహ్వానించి క్షేత్రస్థాయిలో సర్వే చేసి అర్హులను గుర్తించాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే కొత్త కార్డులు జారీ అయ్యే అవకా శం ఉంది. మరణించిన వారికి సంబంధించి తొలగింపులు జరిగినా కొత్త పేర్ల నమోదుకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో వారి దరఖాస్తులు కొన్నేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. తాజాగా రేషన్‌కార్డుదారుల కేవైసీ ప్రక్రియ చేపట్టగా కార్డుదారుల్లో మరణించిన వారి వివరాలు వెల్లడయ్యాయి. కొంతమంది పదేళ్లుగా చెప్పకుండా రేషన్ తీసుకున్నట్టు తెలిసింది.



# సీఎం చంద్రబాబుతో మందకృష్ణ భేటీ..!



**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24 :** సీఎం చంద్రబాబుతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు. హైదరాబాద్లోని నివాసంలో ఆయనను కలిసి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్గీకరణ కోసం దశాబ్దాలుగా పోరాటం చేసినందుకు మందకృష్ణను చంద్రబాబు సత్కరించారు. కాగా ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్తోనూ ఆయన సమావేశమైన విషయం తెలిసిందే.

# దేశంలో తొలి ఎంపాక్స్ ఆర్టీపీసీఆర్ కిట్ తయారీ..

**తెలంగాణ వీణ/అమరావతి:ఆగస్టు 24 :** విశాఖ మెడ్టెక్ జోన్ మరో ఘనతను సొంతం చేసుకుంది. కరోనా సమయంలో ఆరోగ్య రంగానికి కావాల్సిన పలు దేశీయ ఉత్పత్తులు అందించిన ఈ సంస్థ తాజాగా..మంకీపాక్స్ నిర్ధారణ కోసం దేశీయంగా తయారైన తొలి మంకీపాక్స్ ఆర్టీ-పీసీఆర్ కిట్ను ఉత్పత్తి చేసింది. మెడ్టెక్ జోన్ భాగస్వామి ట్రాన్సాసియా దయాగ్నోస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎర్బామ్ డీఎక్స్ మంకీ పాక్స్ కెకె ఆర్టీ-పాక్స్ పేరిట కిట్ రూపకల్పన చేసింది. ఈ కిట్కి ఐసీఎంఆర్, కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి అత్యవసర అనుమతి లభించింది. ప్రపంచ ఆరోగ్య ఆవిష్కరణలలో ముందంజలో ఉన్న భారతదేశ స్థానాన్ని ఈ ఆవిష్కరణ ప్రతిబింబిస్తుందని మెడ్టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ అన్నారు.




# రేవంత్‌రెడ్డి పేరిట ప్రభుత్వ భూమి!

- 2009 ఎలక్షన్ అఫిడవిట్‌లో వెల్లడి
- 2023 అఫిడవిట్‌లో ఎందుకు పెట్టలె
- సోషల్‌మీడియాలో నెటిజన్ ప్రశ్న



**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్టు 24 :** సీఎం రేవంత్ పేరిట ప్రభుత్వ భూమి ఉన్నట్టు 2009 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని, 2023 అఫిడవిట్‌లో ఎందుకు పెట్టలేదని ఎక్స్ వేదికగా భరత్ అనే నెటిజన్ పోస్టు చేశారు. ఈ విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గోపన్‌పల్లి సర్వే నంబర్ 372, 306, 3, 292లో భాగం ఉన్నట్టుగా, 127 తన పేరు మీద ఉన్నట్టు 2009 ఎన్నికల అఫిడవిట్‌లో రేవంత్‌పేర్కొన్నారని నెటిజన్ వివరించారు. 2023 అఫిడవిట్‌లో 128/ఏఏ మాత్రమే ఉన్నట్టు తెలిపారని వెల్లడించారు. సర్వే నంబర్ 3, 292 అనేవి ప్రభుత్వ భూములని, ఆ ఊర్లో సర్వే నంబర్ 372 లేనేలేదని పేర్కొన్నారు. సర్వే నంబర్ 3, 292 రేవంత్‌వి అయితే 2023లో ఎందుకు అఫిడవిట్‌లో పెట్టలేదని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడవిట్లతోపాటు, రెవెన్యూ రికార్డుల పత్రాలను కూడా అందులో పోస్ట్ చేశారు.

## సీఎం రేవంత్‌కు వివేకం రావాలి: బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్


ఆకతాయితనంతో వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిలో వివేకం నెలకొనాలని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆశించారు. సీఎం రేవంత్ ముఖ్యమంత్రిగా ఉన్నతిని ప్రదర్శించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సీఎం దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులను తన అనుచరులతో వీరంగం సృష్టించినట్టే.. శనివారం కేటీఆర్ మహిళా కమిషన్ కార్యాలయానికి హాజరైతే అవే చర్యలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి తన ఆకతాయితనాన్ని వీడి వివేకంతో వ్యవహరించాలని సూచించారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలకైనా సంప్రదించండి
8328209811

## హైడ్రానెవడ్రా ఆపేది ..

# బిగ్‌బాస్‌కే గునపం!

**హైడ్రాకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చి.. దాని కోరలకు సీఎం రేవంత్ మరింత పదునుపెట్టారు. దీంతో పొలిటికల్ పార్టీలు, కొంతమంది లీడర్లలో గుబులు రేగుతోంది. ఇందులో బీఆర్ఎస్ నేత కేటీఆర్ దోస్తు ఫామ్ హౌస్‌నూ హైడ్రా వదల్లేదు. హైకోర్టు జోక్యంతో కూల్చివేతలకు కాస్త బ్రేక్ పడగా.. ఇప్పుడు బిగ్ బాస్ అక్రమ నిర్మాణం ఎన్ కన్వెన్షన్‌పై గునపం దిగింది. రాజకీయ వైరుధ్యాల బారికేడ్లు అడ్డొస్తున్నా సీఎం రేవంత్ హైడ్రా విషయంలో జోక్యం చేసుకోవడం లేదు. కమిషనర్ రంగనాథ్‌కు సర్వాధికారాలు ఇవ్వడంతో.. ఆధారాలున్న అక్రమాల అంతుచూడకుండా వదిలేదంటూ ఆయన మరింత దూకుడు పెంచారు.**



- అక్రమార్కుల గుండెల్లో గుబులు
- ఎవ్వరైనా సరే నో కాంప్రమైజ్
- అక్రమ కట్టడాల్ని కూల్చాల్సిందే
- చెరువులకు రక్షణ హైడ్రా గొడుగు
- నాలాల ఆక్రమణలకు విముక్తి
- టార్గెట్ ఫిక్స్ చేసిన కమిషనర్ రంగనాథ్
- కేటీఆర్ దోస్త్ ఫామ్ హౌస్‌పై ఫోకస్
- సినీ హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ మటాష్
- కోర్టులో తేల్చుకుంటామన్న నాగార్జున
- చెరువులను ఆక్రమించి పెద్ద పెద్ద నిర్మాణాలు
- బడా బాబుల గుండెల్లో హైడ్రా గుబులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలపై హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం సిటీ అంతా ఎక్కడ చూసినా హైడ్రా ముచ్చటే వినిపిస్తోంది. జీహెచ్ఎంసీతో పాటు నగర శివార్లలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లోనూ హైడ్రా ఆపరేషన్ పేరు వినిపిస్తోంది. అక్రమ కట్టడాలపై హైడ్రా బుల్డోజర్లు గునపాలు దింపుతున్నాయి. చెరువులు, పార్కులు, లే అవుట్లలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, పరిశ్రమల శాఖకు చెందిన స్థలాల్లో ఆక్రమణలను అడ్డుకుంటూ అక్రమార్కుల గుండెల్లో హైడ్రా వణుకు పుట్టిస్తోంది. చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడటమే ప్రధాన కర్తవ్యంగా ముందుకు సాగుతున్న హైడ్రా.. ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకుంది. అంతకాకుండా.. ఆయా ప్రాంతాల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలపై కొరఢా ఝుళిపిస్తోంది.**నాగార్జున ఎన్. కన్వెన్షన్‌కు షాక్...** హైదరాబాద్ తుమ్మిడి చెరువులో సినీ హీరో నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతను హైడ్రా అధికారులు ప్రారంభించారు. పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా రంగంలోకి దిగి కూల్చివేతలు చేపట్టింది. నాగార్జునకు సంబంధించి ఎన్ కన్వెన్షన్ సెంటర్‌పై కొద్ది రోజుల కిందట హైడ్రాకు ఫిర్యాదు అందింది. తుమ్మిడి చెరువును ఆక్రమించి 3 ఎకరాల్లో ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించారని ఫిర్యాదు వచ్చింది. దీంతో విచారణ జరిపిన అధికారులు అది ఆక్రమిత స్థలంగా తేల్చుకుని పక్కా ఆధారాలతో శనివారం తెల్లవారుజాము నుంచే కూల్చివేతలు చేపట్టారు. ఒకప్పుడు హైదరాబాద్ నగరం చెరువులతో నిండి ఉండేది. కానీ సిటీ అభివృద్ధి పేరుతో నగరంలోని అనేక చెరువులు కబ్జాలకు గురయ్యాయి. ఈ క్రమంలోనే 44 ఏళ్లలో అంటే 1979 నుంచి 2023 వరకూ నగర పరిధిలోని చెరువుల స్థితిపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఓ నివేదిక రూపొందించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా 56చెరువుల వివరాలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి అందజేసింది. వాస్తవ విస్తీర్ణం.. ప్రస్తుత విస్తీర్ణంతో కూడిన సమాచారాన్ని ఇచ్చింది. దీని ఆధారంగా కబ్జాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. **ఆక్రమణ నిజమే..** హీరో నాగార్జున నల్ల ప్రీతమ్ రెడ్డితో కలిసి మాదాపూర్‌లో ఎన్3 ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఎన్ కన్వెన్షన్‌ను 2015లో నిర్మించారు. మొత్తం 10 ఎకరాల్లో ఎన్ కన్వెన్షన్ ఉంది. నార్త్ ట్యాంక్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివరాల ప్రకారం.. తమ్మిడికుంటలోని ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం 29.24 ఎకరాలు. ఎన్ కన్వెన్షన్ ద్వారా ఎఫ్‌టీఎల్‌లో 1.12 ఎకరాలు, బఫర్ జోన్‌లో 2 ఎకరాలు ఆక్రమణలు జరిగాయి. 2014లోనే మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువులోని 1.12 ఎకరాల ఎఫ్‌టీఎల్, 2 ఎకరాల బఫర్ జోన్‌లో కన్వెన్షన్ హాల్ ఆక్రమణకు గురైనట్లు సర్వేలో తేలింది.**అప్పట్లో రేకుల షెడ్డునే కూల్చారు...** అయితే.. అప్పట్లో చెరువుకు ఎదురుగా ఉన్న ఎన్ కన్వెన్షన్ హాల్‌లోని షెడ్డును మినహా.. జీహెచ్ఎంసీ దేన్ని కూల్చివేయలేదు. కొత్తగా ఏర్పడిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అధికారులు.. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను లక్ష్యంగా చేసుకుని కూల్చివేత మొదలుపెట్టారు. **ఎనిమిది ఏండ్ల కిందటే సీఎం రేవంత్ నజర్...** హైదారాబాద్‌లోని హైటెక్ సిటీ రోడ్డులోని ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా టీమ్ నేలమట్టం చేసింది. ఈ అంశం ఇప్పుడు టాక్ ఆఫ్ ది తెలంగాణగా మారింది. ఎన్ కన్వెన్షన్ అక్రమ నిర్మాణమని.. దానిపై ఏం చర్యలు చేపట్టారో చెప్పాలని 2016లోనే రేవంత్ రెడ్డి అప్పటి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అప్పుడు.. ఇప్పుడు ఒకేమాట.. దటీజ్ రేవంత్ అంటూ సోసల్ మీడియాలో పొగడ్తల వర్షం కురుస్తోంది. 2016లో మిషన్ కాకతీయపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా.. చెరువు ఆక్రమణకు గురవుతున్నాయని.. వాటిని కాపాడటానికి ఏం చర్యలు తీసుకున్నారని అప్పుడు ప్రతిపక్షంలోని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అప్పుడు నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు ఉండగా.. కొడంగల్ నుంచి తెలుగుదేశం పార్టీ తరపున రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఏమన్నారంటే.. **సినీ హీరోలు ఆదర్శంగా ఉండాలి..** సినిమా హీరోలు అంటే ప్రజలకు ఆదర్శంగా ఉండేవారు. మంచిని ప్రజలకు బోధించేవారు. వాళ్లను ఆదర్శంగా సమాజం తీసుకుంటుంది. హైటెక్ సిటీ ఎదురుగా చెరువు భూముల్లో ఎన్ కన్వెన్షన్ అనే ఫంక్షన్ హాల్ ఏదైతే ఉందో.. చెరువులో సగానికి అడ్డంగా గోడ కట్టింద్రు. కొన్ని ఎకరాలు ఆక్రమించుకొని ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారు. ఈ విషయం పదేపదే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. టీవీ ఛానెళ్లలో, పేపర్లలో చూపించారు. అక్కినేని నాగార్జున కూడా దీనిపై స్పందించారు. ఈనాటి వరకు కూడా ఎందుకు అక్కినేని నాగార్జున ఆక్రమించుకొని కట్టిన కట్టడాలను తొలగించలేదు. ఏ శక్తులు అడ్డం పడుతున్నాయ్.. ఎప్పటిలోగా చర్యలు తీసుకుంటారో మంత్రి సూటిగా సమాధానాం చెప్పాలి' అని రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రేవంత్ రెడ్డిని ప్రశంసిస్తున్నారు. అప్పుడు.. ఇప్పుడు ఒకేమాట.. దటీజ్ రేవంత్ అంటూ నెటిజన్లు పొగడ్తల జల్లు కురిపిస్తున్నారు.**అక్రమార్కుల గుండెల్లో గుబులు..** ఆక్రమణల పర్వంతో హైదరాబాద్ నగరంలో వర్షం పడితే జల దిగ్బంధనం అవుతోంది. చెరువులు ఆక్రమించి విల్లాలు నిర్మించారు. ఇక..పార్టీలకు అతీతంగా పలువురు ప్రముఖులు ఆక్రమణలతో నిర్మాణాలు చేసారు. ఇప్పుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేసిన హైడ్రా అధికారులు తరువాతి టార్గెట్ ఏంటనే చర్చ మొదలైంది. ప్రముఖుల ఫం హౌస్ లు, విల్లాలను ఎక్కడైతే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారో వాటి పైన గురి పెట్టినట్లు తెలుస్తోంది. రేవంత్ %-% హైడ్రా నిర్ణయాలను నెటిజెన్లు ప్రశంసిస్తూ..హ్యాట్సాఫ్ చెబుతున్నారు. ఇప్పుడు నెక్స్ట్ టార్గెట్ ఏంటనే చర్చ ఆసక్తి కరంగా మారుతోంది. ఈక్రమంలో.. పలువురు రాజకీయ నాయకుల కట్టడాలపై కూడా అధికారులు బుల్డోజర్లు ప్రయోగిస్తున్నారు. ఈ స్థితిలో హైదరాబాద్ వ్యాప్తంగా.. ఎప్పుడు ఎక్కడ ఏ నిర్మాణాలపై బుల్డోజర్లు ప్రయోగిస్తారోనన్న ఆందోళన మొదలైంది. **ప్రభుత్వ భూముల్లో రియల్ గద్దలు..** ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే రియల్ గద్దలు తిష్ట వేశాయి. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ, చెరువు శిఖం భూముల్లో బోర్డులు పెట్టేసి.. వెంచర్లు వేసి నకిలీ పత్రాలు సృష్టించి అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలోనే.. స్థలాలు వాళ్లకు తెలియకుండానే.. కొనుగోలు చేసి నిర్మాణాలు కూడా చేపట్టిన దాఖలాలున్నాయి. ఈ నేపథ్యంలోనే.. "మన ఆస్తులు సురక్షితమేనా.. లేదా మనవాటిపైకి కూడా బుల్డోజర్లు వస్తాయా..?" అనే భయం చాలా మందిలో నెలకొంది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ" ఇప్పుడు అక్రమార్కుల భరతం పడుతోంది. **చెరువుల పరిరక్షణే ఇంపార్టెన్స్..** చెరువుల బఫర్‌జోన్‌లలోనూ, నాలాల్ని ఆక్రమించిన చోట్లను గుర్తించి.. అక్కడున్న అక్రమ నిర్మాణాల్ని హైడ్రా టీమ్ పడగొడుతోంది. జేసీబీలు, బుల్డోజర్లను రంగంలోకి దించి కూల్చివేస్తున్నారు. రాజేంద్రనగర్, మియాపూర్, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్ ఇలా ఎక్కడైనా సరే.. ఆక్రమణల తొలగింపే లక్ష్యంగా హైడ్రా టీమ్స్ యాక్షన్‌లోకి దిగాయి. జీహెచ్ఎంసీ తోపాటు చుట్టుపక్కల కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయితీల్లో చాలా చెరువులు 60 శాతం వరకూ కబ్జాకు గురైనట్టు ఇప్పటికే లెక్కలు తేల్చారు. వాటి పరిరక్షణకు యాక్షన్ మొదలుపెట్టారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కొన్ని భవనాలు కూల్చేశారు. గ్రేటర్ చుట్టుపక్కల పదుల సంఖ్యలో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్కడ నిర్మించిన భవనాలనూ ఇప్పుడు నేలమట్టం చేస్తున్నారు. పొలిటికల్ ఒత్తిళ్లకు తావులేకుండా ఎక్కడైతే ఆక్రమణలు కనిపించాయో వాటిపై కొరడా ఝుళిపిస్తున్నారు. **కోర్టులో తేల్చుకుంటాం: అక్కినేని నాగార్జున...** గచ్చిబౌలిలోని తన ఎన్ కన్వెన్షన్ సెంటర్ ను అక్రమ కట్టడం పేరుతో శనివారం కూల్చివేయడాన్ని హీరో అక్కినేని నాగార్జున తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు హైడ్రా, తెలంగాణ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ చర్యలతో ప్రజలు తమను తప్పుగా అనుకోకుండా ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా చేసిన కూల్చివేతపై కోర్టులోనే తేల్చుకుంటానని వెల్లడించారు. స్టే ఆర్డర్‌లు, కోర్టు కేసులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్‌కు కూల్చివేతలు చేపట్టడం బాధాకరమని అక్కినేని నాగార్జున తన ప్రకటనలో తెలిపారు. తమ ప్రతిష్టను కాపాడటం కోసం, కొన్ని వాస్తవాలను తెలియజేయడం కోసం, చట్టాన్ని ఉల్లంఘించేలా తాము ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపేందుకు ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు. అదో ఓ పట్టా భూమి అని, ఒక్క అంగుళం ట్యాంక్ ప్లాన్ కూడా ఆక్రమణకు గురికాలేదని నాగార్జున పేర్కొన్నారు. అది ప్రైవేట్ స్థలంలో నిర్మించిన భవనం అన్నారు. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపైనా కోర్టు స్టే ఇచ్చిందన్నారు. **నాగార్జునకు హైకోర్టులో ఊరట...** తెలంగాణ హైకోర్టులో హీరో నాగార్జునకు భారీ ఊరట లభించింది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైకోర్టు స్టే విధించింది. కూల్చివేతలు ఆపాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. . నేటి ఉదయం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల తన ఎన్ కన్వెన్షన్ సెంటర్ ను అధికారులు కూల్చివేశారు. . ఈ కూల్చివేతపై నాగార్జున తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు ఈ కూల్చివేతలపై స్టే ఇచ్చింది.

## కూరగాయల సంత వేలంపాట




**తెలంగాణ వీణ/మొగుళ్ళపల్లి, ఆగస్టు 24:** మొగుళ్లపల్లి మండల కేంద్రంలోప్రతి శుక్రవారం నిర్వహించే కూరగాయల మార్కెట్ సంత ఈరోజు మండల స్పెషల్ ఆఫీసర్ సునీత నేతృ త్వంలో గ్రామపంచాయతీ ఆవరణలో వేలం పాట నిర్వహి ంచడం జరిగింది. ఈ వేలం పాటలో సుమారు 17 మంది వేలంపాటలో పాల్గొనగా 35,500 పాట ద్వారా నిమ్మల సార య్య దక్కించుకోవడం జరిగింది.. ఈ సందర్భంగా నిమ్మల సారయ్య మాట్లాడుతూ... మార్కెట్ సంతకు వచ్చే వ్యాపా వేత్తలు, స్థానిక వ్యాపారులు, ప్రజలు అందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. జిపి సెక్రెటరీ నరేష్ జిపి పాలక మండలి మాజీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యోగాతో సార్వత్రిక శక్తి, ఆధ్యాత్మిక జ్ఞానం జిల్లా కలెక్టర్



**తెలంగాణ వీణ/కరీంనగర్ టౌన్, ఆగస్ట్ 24 :** మన పూర్వీకులు అందించిన వారసత్వ సంపద అయిన యోగాతో కేవలం ఆధ్యాత్మిక జ్ఞానమే కాకుండా సార్వత్రిక శక్తి అలవర్చుకునే అవకాశం ఉందని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు, జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి యోగాసనా పోటీల ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

## పలు శుభకార్యాలలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య దంపతులు



**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 24 :** వరంగల్ ఉర్సు గుట్ట నాని గార్డెన్స్ లో జరిగిన ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ పుల్లయ్య కుమారుడి వివాహానికి వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య-డాక్టర్ నజీర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా రఘునాథ్ పల్లి మండలం, కుర్చపల్లి గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హల్ లో జరిగిన చింతల నరేష్ కుమార్తె హాఫ్ సారి ఫంక్షన్ కు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఎవరు ఆపలేరు

**- యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్‌గా జక్కిడి శివ చరణ్ రెడ్డి గెలుపు ఖాయం: కాంగ్రెస్ యూత్ నాయకుడు బోదేపూడి రాజా**

**తెలంగాణ వీణ/ఖమ్మం,ఆగస్టు 24 :** యూత్ కాంగ్రెస్ ఎలక్షన్లో స్టేట్ ప్రెసిడెంట్ గా పోటీ చేస్తున్న జక్కిడి శివ చరణ్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారు అనే విషయాన్ని గ్రహించి ప్రత్యర్థి అతను పై అక్రమ కేసులు బనాయించి బ్లాక్ లిస్టులో పెట్టించారని జరిగిన సమావేశంలో కాంగ్రెస్ యూత్ నాయకుడు బోదేపూడి రాజా ఆరోపించారు . దీనిని తీవ్రంగా ఖండించారు . ఎవరెన్ని కుతంత్రాలు చేసినా అతని గెలుపు ఖాయమని అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఎవరు ఆపలేరని అన్నారు . అలాగే 2029 లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేస్తామని ధీమా వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో తుమ్మా పరాశర్ గౌడ్ , అఫ్రిది , పవన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు .



# వీధి కుక్కల నియంత్రణకు చర్యలు శూన్యం

**- జిల్లా కలెక్టరే.. నియంత్రణ పై దృష్టి సారించాలి**
**- వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లాలంటే భయమేస్తుంది - ఇక మేము పాడి పరిశ్రమ బంధు చేసుకోవాల్సిందేనా...! - కీసర గ్రామ రైతుల ఆవేదన**



**తెలంగాణవీణ/కీసర:** కీసర మండల కేంద్రంలో వీధి కుక్కల స్వైర విహారం భయ భ్రాంతులకు గురి చేస్తోంది రైతులను,పాడి పరిశ్రమ బంధు చేసుకోవలసిందేనా అని రైతులు అధికారులను నిలదీస్తున్నారు..వివరాల్లోకి వెళితే కీసర గ్రామ పంచాయతీ పరిధిలో కుంటోళ్ల మల్లారెడ్డి అనే రైతు వ్యవసాయం చేస్తూ,తన పొలం వద్ద పాడి గేదెలతో పాల పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం తెల్లవారు జామున తన బావి వద్ద 2 (రెండు) పాడి గేదెల పక్షంలోపు వయస్సున్న దూడలను వీధి కుక్కలు నిర్దాక్షిణంగా లేత దూడల పొట్టలు చీల్చి, పేగులు బయటకు తీసి లేగ దూడలను చంపి వేశాయని రైతు మల్లారెడ్డి వాపోయారు.పట్టు మని పది రోజుల క్రితం సుమారు మూడు లక్షల రూపాయలు పోసి రెండు పచ్చి పాడి గేదెలని కొనుక్కొని తెచుకున్నామని,అవి దూడ పిల్లలు లేక పోతే త్వరగా పాలు ఇవ్వకుండా ఎండిపోతాయని మాకు ఆర్థికంగా ఎంత నష్టం వాటిల్లుతుందోనని రోదిస్తూ వాపోయారు.ఈ కుక్కల బెడదను ఎన్ని సార్ల కీసర గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.ఇదేం పాలన..ఇదేం పద్ధతి రైతులంటే ఈ ప్రభుత్వం చులకన చూస్తుందని దుయ్యబట్టారు. రైతు అనే వాడు పని చేస్తేనే తెల్లారేసరికి ఇంటికి రెండు మెతుకులు,త్రాగడానికి పాలు తదితర దినుసులు వస్తాయని పేర్కొన్నారు. చదువుకున్న అధికారులకు తెలియదా..! ఈ మాత్రం ఇంకిత జ్ఞానం వారికి లేదా అని అన్నారు. మొన్నటికి మొన్న గత శనివారం మా ప్రక్క బావి వద్ద ఆగస్టు 17న, కందాడి రాంగోపాల్ రెడ్డి అనే రైతుకు సంబంధించిన మేకల ఫార్మ్ లో ఇలాగే వీధి కుక్కలు చొరబడి మిట్ట మధ్యాహ్నం 4 మేకలను కొరికి చంపినవి, సరిగ్గా వారం తిరగక ముందే మళ్ళీ 2 లేగా లేత దూడలను కడుపు చీల్చి పేగులు తీసి చంపినవి,ఇంకా ఎంత మంది రైతుల వ్యవసాయ క్షేత్రాల వద్ద ఇలాంటి ఘోరాలు జరగాలని అధికారులు చూస్తున్నారని రైతులు నిలదీస్తున్నారు.

# సామూహిక వివాహాలు చేయించడం అభినందనీయం: ఎమ్మెల్యే శ్రీ గణేష్...



**తెలంగాణ వీణ/కంటోన్మెంట్:** సామాజిక బాధ్యతతో పేదింటి వారిని ఎంచుకొని సామూహిక వివాహాలు చేస్తున్న పబ్బ శ్రీనివాస్ వాసవి దంపతులు సమాజానికి ఆదర్శప్రాయులని కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్,మాజీ బోర్డ్ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. శని వారం డైమండ్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో త్వరలో జరగబోయే సామూహిక వివాహాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. నవంబర్ డిసెంబర్ మాసాలలో 116 జంటలకు పెళ్లి వేదికతో పాటు అన్ని ఏర్పాట్లు చేసి తమ సొంత ఖర్చుతో వివాహాలు జరిపించనున్నట్లు తెలిపారు. తాళిబొట్టు బంగారం వివాహ వేదిక తో పాటు భోజన సౌకర్యం కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. పేద ప్రజలకు సహాయం చేయాలన్న ముఖ్య ఉద్దేశంతో 116 జంటలకు వివాహాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో నిరుపేద ప్రజలు పెళ్లిళ్లకు అయ్యే ఖర్చును భరించలేక, ఆర్థిక స్థితి సరిగా లేని పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో ఇలాంటి సామాజిక దృక్పథంతో కూడుకున్న కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్ మాట్లాడుతూ తన వంతుగా సహాయ సహకారాలు అందించడంతోపాటు ప్రభుత్వం తరఫున షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను కూడా అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి మధుకర్,సంకీ రవీందర్, సదానందు, తేజ్ పాల్, జమీల్,దండుగుల యాదగిరి, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి..



**● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..**

**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 24 :** కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీని అమలు చేయాలని మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు,పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ జిల్లా సంగేమ్ మండలం కాపులకనపర్తి సొసైటీ ఎదుట నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వైఖరితో రాష్ట్రంలోని రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉన్నదని వాపోయారు. వారికి ధైర్యం చెప్పాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎదుటివారిపై అనాలోచితంగా మాట్లాడుతూ.. నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారని దుయ్యబట్టారు. ఉద్యమంలో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు కేసీఆర్ ప్రభుత్వం అన్నీ అమలు చేసిచూపించిందని, దేశంలో గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దిందని కొనియాడారు. ఇన్ని చేసిన కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారన్న ఆలోచనతోనే రేవంత్‌రెడ్డి ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చారని మండిపడ్డారు.కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో 40వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, క్యాబినెట్‌లో మాత్రం 31వేల కోట్లు కేటాయించారని, బడ్జెట్‌లో 17 వేల కోట్లు కేటాయించారని, తీరా చూస్తే 7500 కోట్లు మాత్రమే మాఫీ చేశారని, ఇదెక్కడి లెక్క అని మండిపడ్డారు.రుణమాఫీ పూర్తిగా చేశామని రేవంత్‌రెడ్డి ప్రకటనలు చేస్తున్నారని, మరోవైపు ఆర్థిక మంత్రి ఇంకా చేయలేదు, చేస్తున్నామని మాట్లాడుతున్నారని, ఖమ్మంలో మరో మంత్రి 30 శాతం మందికే ఇచ్చామని, ఇంకా చేస్తామంటున్నారని, మాఫీ లెక్కలపై ప్రభుత్వానికే క్లారిటీ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్పష్టం చేశారు.బీఆర్ఎస్ పాలనలో సీజన్ ప్రారంభంలో రోహిణి కార్తెలో రైతులకు రైతుబంధు అందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ మాత్రం పంట కోతల సమయంలో ఇచ్చిందని, ఈ యేడాది ఇంత వరకు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు ప్రజలు, రైతులందరూ కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చి తప్పు చేశామని బాధపడుతున్నారని, తాము ఎక్కడికి వెళ్లినా ఇదే విషయాన్ని మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అధికార పక్షం ఎంత ముఖ్యమో ప్రతిపక్షం అంతకంటే ముఖ్యమని, కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నింటినీ అమలు చేసేదాకా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెస్ట్ దీన్ దయాల్ నగర్ కాలనీలో పెట్రోలింగ్ పోలీస్ ఏర్పాటు చేయాలి

- అర్ధరాత్రి పోకిరీలు కాలనీలలో సంచరిస్తున్నారు
- నేరేడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్‌కు వినతి...
- వెస్ట్ దీన్ దయాల్ నగర్ అసోసియేషన్ సభ్యులు



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** వినాయక నగర్ డివిజన్ వెస్ట్ దీన్ దయాల్ నగర్ కాలనీలలో రాత్రి సమయాలలో పోకిరిలు తిరుగుతూ కాలనీవాసులకు ఇబ్బంది కలిగిస్తున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకుని కాలనీలో ఉదయం రాత్రి , పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ కు వినతిపత్రం అందజేశారు... అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూగత 15 రోజులు నుండి వినాయక్ నగర్ డివిజన్లో ఉన్న వెస్ట్ దీన్ దయాల్ నగర్ కాలనీలో అర్ధరాత్రులు ఒంటిగంట నుంచి నాలుగు గంటల వరకు గుర్తుతెలియన వ్యక్తులు రోడ్డు నెంబరు ఒకటి నుంచి, 7%ఖ% రోడ్డు వరకు ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరీక్షిస్తూ తిరుగుతున్న తీరుని కాలనీలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల్లో స్పష్టంగా కనిపిస్తున్న తీరుపై అసోసియేషన్ సభ్యులు , కాలనీ అధ్యక్షుడు బి ఎన్ కృష్ణ నేరేడ్మెట్ సర్కిల్ ఇన్స్పెక్టర్కి ఫిర్యాదు చేశారు. రోజు కాలనీలో ఉదయం, రాత్రి వెళ్లాలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించే విధంగా చూడాలని కోరడం పోలీసులను కోరారు. కాలనీకి ఆనుకొని ఉన్న వినాయక్ నగర్ బస్తీ ఏరియా ఉండటం వలన అక్కడి నుంచి పోకిరిలు వస్తున్నారని విశ్వసనీయ సమాచారంగా ఉందని అన్నారు. ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రమాదంతో పాటు తమ యొక్క స్థిర చర ఆస్తులని దోచుకోవటమే కాకుండా ప్రాణ నష్టం కూడా జరుగుతుందేమోనని కాలనీ వాసులు భయభ్రాంతులకు గురి అవుతున్న కాలనీ అధ్యక్షుడు నేరేడ్మెట్ సీఐకి ఫిర్యాదు చేసామని తెలిపారు. సిఐ అందుబాటులో లేకపోవడంతో ఎస్ఐ రమేష్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. తమ కాలనీలో సుమారు 2000 మంది నివసిస్తున్నారని అందులో 400 సభ్యుల దాకా కాలనీ సభ్యత్వం పొంది ఉన్నారని ప్రతి ఒక్కరి సంరక్షణ కాలనీ అధ్యక్షుడిగా తనకు, తన సభ్యులకు ఉన్నదని, క ఏ వ్యక్తికి కూడా ప్రాణ నష్టం, అస్తి నష్టం జరగకుండా చూడాలని , సిఐ, స్పందిస్తూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం పెట్రోలింగ్ పోలీస్ గస్తీ చేసే విధంగా చూస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు .అందులోని భాగంగానే నిన్న రాత్రి ఎస్ ఐ రమేష్ తన బృందంతో కాలనీలో పర్యటించి అల్లరిముఖలను హెచ్చరించారని అసోసియేషన్ సభ్యులు తెలియజేశారు. పాల్గొన్నవారు కాలనీ అధ్యక్షుడు బి ఎన్ కృష్ణ, రవీందర్, గౌరీ శంకర్, రాము, గుర్రాల ఆనందరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నేను గెలిచినా... ఓడినా.. పద్మశాలిలకు అండగా ఉంటా..





**తెలంగాణా వీణ/హైదారాబాద్:** తెలంగాణా రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల పైసమీక్షా సమావేశం తార్నాక లోబూర మల్లేశం ఆద్వర్యం లో నిర్వహించారు. సంఘం రాష్ట కన్వీనర్ బూర మల్లేశం మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమే,ఇప్పటికైనా అందరం కలిసి కట్టుగ పని చేద్దామని,పద్మశాలి సంఘాన్ని పక్కదోవ పట్టకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు.పద్మశాలి సంఘం బలోపేతం చేయడానికి అందరం కల్సి కట్టుగా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరు కలిసి కట్టుగా పని చేయానికి టి ఆర్ పి ఎస్ యొక్క నియమ నియమా వలి కి కట్టు బడి పని చేయుటకు ఏక గ్రీ వంగా తీర్మాణం చేశారు.పద్మశాలి సంఘం ఉద్యమ నాయకుడు వెంకట నారాయణ.రంగ పరంధాములు.మెదక్ జిల్లా అద్యక్షులు గుడ్ల వీర భద్రయ్య మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమే వర్గ బేధాలు లేకుండా మన మందరం ఒకే సంఘం ఒకే నాయకుడిగా ఉంటూ ఎదుటివారి ఆటలు సాగకుండా ముందుకు పోతూ సంఘభివృద్ధే ద్యేయంగా,మరియు ప్రభుత్వ పరంగా మనకు రావాల్సిన నిధులను రాబట్టుకుంటూ చట్ట సభలలో మన ప్రాముఖ్యత చాటుకోవాలని,రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పద్మశాలి ల సత్తా చాటుకోవాలనీ భద్రయ్య అన్నారు.టి ఆర్ పి ఎస్ రాజకీయ సలహాదారులైన రంగ పరందములు మాట్లాడుతూ కలిసి ఉంటే కలదు సుఖం.వర్గ బేధాలు లేకుండా ఎదుటివారిని దెబ్బ తీయాలంటే పద్మశాలి లు అందరు కలుపుకొని సంఘాన్ని అభివృద్ధి పరంలో నడుపాలన్నారు.వివిధ జిల్లాల నుండి హాజరైన పద్మశాలి కుల భాంద వులను శాలువాతో సత్కరించారు.సూర్యాపేట చేనేత సహకార సంఘం అధ్యక్షులు కడారి భిక్షం.శ్రీరాములు.శ్రీరాములు.పట్టణ పద్మశాలి సంఘం ట్రెజరర్ రాపోలు గిరీష్ కుమార్.మున్సిపల్ కౌన్సిలర్ గుండు రమేష్.మొర ఆశన్న.రమేష్ . తెలంగాణా రాష్ట్ర ఐక్యవేదిక కోశాధికారి సిలివేరి గణేష్, రచయిత సునీత లు మాట్లాడారు.అనంతరం ఎన్నికల ఓటమి పై పలు వూరు తమ అభిప్రాయాలు తెలిపారు. సతీష్ మల్లయ్య రచయిత సునీత శంకర్ వనం సుమన్ లు పాల్గొన్నారు.

# మేమూ జర్నలిస్టులమే... మాకూ ఇవ్వండి ఇళ్ళ స్థలాలు

- మంత్రి పొంగులేటికి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ నేతల విజ్ఞప్తి



**తెలంగాణవీణ/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న మేమూ జర్నలిస్టులమేనని, మాకూ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ నాయకులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, డైరెక్టర్లు రామారావు, ఉద్రసేన్ తదితరులు శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య తమ సొసైటీ వివరాలను మంత్రికి వివరించారు. దాదాపు పదిహేను సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఇళ్ళ స్థలాల సమస్యను పరిష్కరిస్తూ, ఆ సొసైటీలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని,అదే సమయంలో తమ సొసైటీకి కూడా స్థలం కేటాయించి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. 2008లో ఏర్పడిన తమ సొసైటీలో దాదాపు 1400 మంది జర్నలిస్టులున్నారని, వీరిలో చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం గత పదిహేనేళ్ళుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులంతా తమకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్న నమ్మకంతో ఉన్నారని మంత్రితో అన్నారు.

**అర్హులైన జర్నలిస్టులందరికీ ఇస్తాం...** రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ సొసైటీకి కోర్టు ఆదేశం మేరకు మొదట ఇవ్వడం జరుగుతుందని, మిగతా సొసైటీల కు త్వరలో ఇస్తామని హామీ ఇచ్చారు.

## యదగిరిగుట్టలో నూతన రెస్టారెంట్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య







**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యదగిరిగుట్టలో పట్టణంలో ఫ్లేవర్స్ ఇన్ రెస్టారెంట్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా ప్రారంభించారు. యాదగిరిగుట్ట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లేవర్స్ ఇన్ రెస్టారెంట్ ని శనివారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు.నాణ్యమైన ఆహారాన్ని పట్టణ మరియు భక్తులకు అందించాలని కోరుతూ రెస్టారెంట్ యాజమాన్యనికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మండల,పట్టణ, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా గణేష్ జన్మదిన వేడుకలు



**తెలంగాణా వీణ/హైదారాబాద్:** తెలంగాణా చేనేత, రాష్ట పద్మశాలి ఐక్యవేదిక కోశాధికారి సిరివేలి గణేష్ నిజామాబాద్. 53వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. హైదారాబాద్‌లోని తార్నాకలో పద్మశాలి ఐక్య వేదిక సమావేశం అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం.టి ఆర్.పీ.ఎస్. సలహాదా రులు పరంధాములు.సిద్దిపేట జిల్లా అద్యక్షులు వీర భద్రయ్య. సీనియర్ జర్నలిస్ట్ అంకం మురళి ధర్.వెంకట నారాయణ. సూర్యాపేట పట్టణ పద్మశాలి సంఘం ట్రెజరర్ రాపోలు గిరీష్ కుమార్ మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి రమేష్. కడారి భిక్షపతి.సుమన్. పురుషోత్తం. సత్యనారాయణ పాల్గొన్నారు.

## సంవత్సరిక కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య దంపతులు

**తెలంగాణా వీణ/హనుమకొండ ప్రతినిధి,ఆగస్టు 24 :** ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో వి6 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ గుంటిపల్లి వెంకట్ తండ్రి సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీ వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# హెూలీఫేత్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో గోపికృష్ణ రూపంలో ఉట్టి కొడుకు ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** గోపికృష్ణ వేషధారణతో ఉట్టి కొడుతూ చిన్నారులు సందడి చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా



యాదగిరిగుట్ట లోని హెూలీఫేత్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ (శుబోదయ) లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు చిన్నారులు గోపిక కృష్ణ వేషధారణ తో సందడి చేశారు కృష్ణుడి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామని, విద్యార్థులకు పండుగ వేడుకలు తెలిసేలా ఘనంగా ప్రతి పండుగ నిర్వహిస్తామని అన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ సాంప్రదాయ బద్ధంగా పండుగ వాతావరణం ఉట్టిపడేలా స్కూల్లో పిల్లలచే కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్.. పారిజాత,గోదాదేవి, మౌనిక, సుజాత, స్రవంతి, సంధ్య, విద్యార్థుల తల్లిదండ్రు తదితరులు పాల్గొన్నారు.







## పలు కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** ఆలేరు మండలం శారాజిపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు సంతోష్ మాతృమూర్తి గండి కోట మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మోటకొండూరు మండలం ఇక్కుర్తి గ్రామంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు.ఇక్కుర్తి గ్రామంలోని అయిలి గిరిధర్ గౌడ్ ప్రమాదవశాత్తు మృతిచెందగా వారి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు.అదే గ్రామానికి చెందిన కొరుటూరు బాలరాజు అనారోగ్యంతో బాధపడుతుండగా అతడిని పరామర్శించారు.

## షాధిముబారక్,సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో షాధిముబారక్,సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పంపిణీ చేశారు.ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 27 మంది లబ్ధిదారులకు,షాధి ముబారక్ చెక్కులను,96 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## స్నేహితుడి మృతదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన బత్తి వెంకట నరసింహారెడ్డి రోడ్డు ప్రమాదం లో మృతిచెందగా శనివారం రోజు బోడుప్పల్ లోని నరసింహారెడ్డి గారి స్వగృహంలో అతని మృతదేహానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నివాళు లర్పించారు. మధ్యప్రదేశ్‌లోని భూపాల్ ట్రిపుల్ ఐటీ లో కొడుక్కి సీటు రావడంతో కాలేజీలో జాయిన్ చేసి తిరిగి వస్తుండగా బస్ యాక్సిడెంట్లు జరిగిన ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బీర్ల ఐలయ్య స్నేహితుడు నరసింహారెడ్డి మృతి చెందారు.కాగా అతడి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



## నాణ్యత పాటించిన హెూటల్స్ పై చర్యలు తీసుకుంటాం: మున్సిపల్ కమిషనర్

- ఆకస్మికంగా తనిఖీ చేపట్టిన కమిషనర్





**తెలంగాణవీణ/కీసర:** నాగారం మున్సిపల్ పరిధిలోని పలు హెూటల్స్ లలో శనివారం మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. సరైన నాణ్యత పాటించడం లేదని వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు తనఖీలు చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని విజయదుర్గ రెస్టారెంట్, అరేబియన్ మండి, ఓహెూ హైదరాబాది హెూటల్, హవిస హెూటల్,రెడ్ బకెట్ బిర్యానీ, గోదావరి రెస్టారెంట్ హెూటల్స్ ను మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి, నాణ్యత పాటించని 6 హెూటళ్లకు రూ.95 వేలు పెనాల్టీ విధించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చలాగాటమాడే హెూటల్స్ పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌సిసి పైప్ లైన్ పనులు ప్రారంభం: కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** డివిజన్ అభివృద్ధి కోసం కాలనీలో పైప్ లైన్ ట్ పనులతో కాలనీలకు వరద వరద బుక్కు నుండి ఉపశమనం కలుగుతుందని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ తెలిపారు. శనివారం మౌలాలి డివిజన్ పరిధిలో మారుతి నగర్ లో 64 లక్షల వ్యయంతో 1000 డయా ఆర్‌సిసి పైప్ లైన్ పనులను కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నానని, ఈ పైపు లైను పనితో కొన్ని కాలనీలకు వరద ముంపు నుండి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.. భవిష్యత్తులో కూడా మౌలాలి డివిజన్ ని అధికారుల సహాయంతో మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు., ఈ కార్యక్రమంలో ఏఈ మధురిమ , వర్క్ ఇన్స్పెక్టర్స్ నరేంద్ర ,మహేందర్ ,కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , మూర్తి శ్రీనివాస్ , ఐ ఎస్ రావు , కిరణ్ గారు, నాగరాజ గారు ,రవీంద్ర రుద్రరాజు గారు , జయనంద్, డివిజన్ బిజెపి అధ్యక్షులు అనిపెద్ది సాయిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగారావు, డివిజన్ కార్యదర్శి శివ గౌడ్, రమణ రాము తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


## నారాయణ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు






**తెలంగాణ వీణ/నాచారం:** నారాయణ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి.యం. గోపాల్ రెడ్డి, ఏ.జి.యం. బాల పరమేశ్వర్, కోఆర్డినేటర్స్,ప్రధానోపాధ్యాయులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకను ప్రారంభించారు.పాఠశాల విద్యారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని అందరిని అలరించారు.ఈ వేడుకలలో భాగంగా విద్యార్థులు ఉట్టిని కొట్టి ఆనందోత్సాహంతో కేరింతలు కొట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వేడుకలను తిలకించారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు శ్రీకృష్ణ, గోపిక వేషదారణలో వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు.

## కాకతీయ నగర్ లిటిల్ పెరెల్స్ హై స్కూల్ కృష్ణాష్టమి వేడుకలు...







**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** వినాయక నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ లిటిల్ పెరెల్స్ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్కూలుకు చెందిన చిన్నారులు రాధాకృష్ణ, బలరామకృష్ణుడు, గోపిక, దేవికి ,వేషధారణలో ఉత్సాహంగా చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారి ఎం హేమశ్రీ గోపిక వేషధారణలో అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ కాజా గౌసుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు



G9 TV తెలుగు
తెలంగాణ వీణ
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL

# పాకిస్థాన్ ఓవర్ కాన్ఫిడెన్స్‌పై కొట్టిన దెబ్బ బంగ్లా బ్యాటర్లు



రెండు టెస్టుల సిరీస్ ఆడేందుకు పాకిస్థాన్‌కు వెళ్లిన బంగ్లాదేశ్ జట్టు.. అసాధారణ ఆటతో పాక్ జట్టుకు గట్టి కౌంటర్ ఇస్తోంది. ముఖ్యంగా పాకిస్థాన్ ఓవర్ కాన్ఫిడెన్స్‌పై బంగ్లా బ్యాటర్లు కొట్టిన దెబ్బ సూపర్ అనే చెప్పాలి. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా.. రావాల్పిండి వేదికగా తొలి టెస్ట్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసింది. ఆరంభంలో 16 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినా.. తర్వాత కోలుకొని భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ షఫీఖ్, కెప్టెన్ షాన్ మసూద్, మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ దారుణంగా విఫలం అయ్యారు. ఆ తర్వాత సౌద్ షకీల్‌తో కలిసి యువ ఓపెనర్ సైమ్ అయ్యూబ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత అయ్యూబ్ అవుట్ అయ్యాడు. ఇక ఇక్కడి నుంచి సౌద్ షకీల్–మొహమ్మద్ రిజ్వాన్ జోడి బంగ్లాదేశ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఇద్దరు సెంచరీలతో చెలరేగారు. సౌద్ షకీల్ 141 పరుగులు చేసి అవుట్ అయినా.. రిజ్వాన్ మాత్రం డబుల్ సెంచరీ దిశగా దూసుకెళ్లాడు. మొత్తం 113 ఓవర్ల తర్వాత 6 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసిన తర్వాత.. ఆ స్కోర్ బంగ్లాదేశ్‌ను రెండు సార్లు ఆలౌట్ చేయడానికి సరిపోతుందని.. ఓవర్ కాన్ఫిడెన్స్‌తో పాకిస్థాన్ కెప్టెన్ షాన్ మసూద్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. పాపం. రిజ్వాన్ 171 పరుగులు చేసి డబుల్ సెంచరీకి మరో 29 పరుగుల దూరంలోనే ఉన్నాడు. అయినా.. కూడా పాక్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తమకు 448 పరుగులు సరిపోతాయనే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో కనీసం 500 స్కోర్ కూడా లేకుండా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన పాకిస్థాన్‌కు షాకిస్తూ.. బంగ్లాదేశ్ జట్టు.. 448 పరుగుల స్కోర్‌ను దాటేస్తూ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తోంది. బంగ్లా సీనియర్ బ్యాటర్ ముస్తఫికుర్ రహిమ్ 148 పరుగులతో బ్యాటింగ్ చేస్తూ.. పాక్ పొగరు అణుస్తున్నాడు. అతని పాటు మెహదీ హసన్ మిరాజ్ 42 రన్స్‌తో ఆడుతున్నాడు. అలాగే ఓపెనర్ ఇస్లామ్ 93 పరుగులతో రాణించాడు. మొమినుల్ 50. లిట్టన్ దాస్ 56 పరుగులు చేసి పర్వాలేదనిపించారు. ఇలా బంగ్లా బ్యాటర్లు రాణించడంతో.. ఆట నాలుగో రోజు 6 వికెట్ల నష్టానికి బంగ్లాదేశ్ 460కి పైగా పరుగులు చేసి భారీ స్కోర్ దిశగా వెళ్తుంది. 448 పరుగులు చేయకుండా బంగ్లాదేశ్‌ను రెండు సార్లు ఆలౌట్ చేసి మ్యాచ్ గెలుద్దాం అనుకున్న పాకిస్థాన్‌కు ఇది చెప్పపెట్టు లాంటి మ్యాచ్ అనొచ్చు.

# సౌతాఫ్రికాను చిత్తు చేసిన వెస్టిండీస్



దక్షిణాఫ్రికాతో మూడు టీ20ల సిరీస్‌లో వెస్టిండీస్ శుభారంభం చేసింది. ట్రినిడాడ్ వేదికగా జరిగిన తొలి టీ20లో సౌతాఫ్రికాపై 7 వికెట్ల తేడాతో విండీస్ ఘన విజయం సాధించింది. 175 పరుగుల భారీ లక్ష్యాన్ని కరేబియన్లు ఊదిపడేశారు. 17.5 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి విండీస్ ఛేదించింది. లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ ఓపెనర్లు అలిక్ అథనాజ్(40), షాయ్ హోప్(51) పరుగులతో అద్భుత ఆరంభాన్ని అందించారు. అనంతరం క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ తన విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. కేవలం 26 బంతులు మాత్రమే ఎదుర్కొన్న పూరన్.. 7 సిక్స్‌లు, 2 ఫోర్లతో 65 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సఫారీ బౌలర్లలో బార్ట్‌మన్ ఒక్కడే రెండు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ప్రోటీస్ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్(76) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.. ఆఖరిలో ప్యాట్రిక్ కుర్గర్(44) పర్వాలేదనిపించాడు. విండీస్ బౌలర్లలో ఫోర్డే 3 వికెట్లు పడగొట్టగా.. జోషఫ్ రెండు, అకిల్ హొస్సేన్ తలా వికెట్ సాధించారు. ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఆగస్టు 25న ట్రినిడాడ్ వేదికగానే జరగనుంది.

# వేలంలో రూ.40 లక్షలు పలికిన విరాట్ కోహ్లీ జెర్సీ..

క్రికెట్ ఫర్ చారిటీ ' వేలాన్ని తాజాగా భారత క్రికెటర్ కేఎల్ రాహుల్, అతని భార్య అతియా శెట్టి నిర్వహించారు. వేలం ఉద్దేశం నిరుపేద పిల్లలకు విద్యను అందించడానికి కృషి చేస్తున్న ఓ సంస్థకు సహాయం చేయడమే. ఈ వేలంలో టీమిండియా తరఫునుండి చాలామంది క్రికెటర్లు వారి వ్యక్తిగత వస్తువులను వేలానికి అందించారు. ఇందులో విరాట్ కోహ్లీ ధరించిన జెర్సీ, ఆయన బ్యాటింగ్ సమయంలో వాడిన బ్యాటింగ్ గ్లోవ్స్ ఇంకా, రోహిత్ శర్మ బ్యాట్, మహేందర్ సింగ్ బ్యాట్, రాహుల్ ద్రావిడ్ బ్యాట్ ఇలా అనేక వస్తువులకు వేలంపాట నిర్వహించారు. ఇక ఈ వేలంలో ఏ వస్తువు ఎందుకు అమ్ముడుపోయిందో ఓసారి చూస్తే.. ఈ వేలంలో అత్యధికంగా ధరించిన జెర్సీ ఏకంగా 40 లక్షల రూపాయలకు అమ్ముడుపోయింది. ఆ తర్వాత కోహ్లీ బ్యాటింగ్ సమయంలో వినియోగించిన గ్లోవ్స్ 28 లక్షలు పలికాయి. ఇక ఆ తర్వాత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాట్ ను క్రికెట్ ఫర్ చారిటీ వేలంలో 24 లక్షల రూపాయలు పలికింది. మహేంద్ర సింగ్ ధోని బ్యాట్ కు 13 లక్షల రూపాయలు, టీమిండియా మాజీ ఆటగాడు %c% కోచ్ రాహుల్ ద్రావిడ్ బ్యాట్ కు 11 లక్షల రూపాయలు, అలాగే కేఎల్ రాహుల్ ధరించిన జెర్సీ కి 11 లక్షల రూపాయలు వచ్చాయి. కేఎల్ రాహుల్ అతడి భార్య అతియా శెట్టి మొదలుపెట్టిన ఈ ప్రచారంలో టీమిండియా ఆటగాళ్లు రిషబ్ పంత్, సంజు శాంసన్, జస్ప్రీత్ బుమ్రాలు కూడా భాగస్వాములు అయ్యారు. వీరితోపాటు అంతర్జాతీయ ఆటగాళ్లు నికోలస్ పూరన్, జోస్ బట్లర్, క్వింటన్ డికాక్ లాంటి ఆటగాళ్లు సహకారం కూడా ఈ ప్రచారంలో



భాగస్వాములయ్యారు. ఇకపోతే., ఈ చారిటీ వేళల్లో మొత్తంగా రూ. 1.93 కోట్ల రూపాయల మొత్తం నిధులు సమకూరినట్లు సమాచారం. ఈ విషయాన్ని తాజాగా ఇన్స్టాగ్రామ్ లో తన కథనాన్ని పోస్ట్ చేశాడు కేఎల్ రాహుల్. తాము నిర్వహించిన వేలం విజయవంతం అయిందని ఈ డబ్బు మొత్తం నిరుపేద పిల్లలు చదువు కోసం వినియోగిస్తానని ఆయన చెప్పుకొచ్చాడు. ఇంతటి మంచి పని చేసిన కేఎల్ రాహుల్ దంపతులకు సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# ఇంటర్నేషనల్ క్రికెట్‌కు గబ్బర్ గుడ్ బై...



భారత క్రికెట్ జట్టు మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్, క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్లు తెలిపాడు. టీమ్ ఇండియాకు ఆడిన బెస్ట్ ఓపెనర్లలో ధావన్ ఒకరు. రోహిత్ శర్మ జోడీగా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన ఈ ఢిల్లీ బ్యాటర్, కొన్నాళ్లుగా ఇంటర్నేషనల్ క్రికెట్‌కు సెలక్ట్ కావట్లేదు. తాజాగా ప్రొఫెషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు వెల్లడించాడు. 38 ఏళ్ల శిఖర్ ధావన్, 2010లో విశాఖపట్నంలో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేతో ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఎంట్రీ ఇచ్చాడు. 2022లో బంగ్లాదేశ్‌పై ఆడిన వన్డే, అతడి చివరి ఇంటర్నేషనల్ మ్యాచ్. గత రెండు సంవత్సరాలుగా ఫామ్ కోల్పోవడం, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ వంటి యంగ్ ఓపెనర్స్ పోటీలోకి వచ్చి సత్తా చాటడంతో ధావన్‌కు అవకాశాలు తగ్గిపోయాయి. 'లెక్కలేనన్ని జ్ఞాపకాలు, కృతజ్ఞతతో నా క్రికెట్ జర్నీ ముగిస్తున్నాను. మీ ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు! జై హింద్!' అని ధావన్ తన సోషల్ మీడియా అకౌంట్స్‌లో పోస్ట్ చేశాడు. 2010 అక్టోబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేసిన ధావన్, భారత్ తరఫున 34 టెస్టులు, 167 వన్డేలు, 68 టీ20లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 24 సెంచరీలు, 55 హాఫ్ సెంచరీలతో మొత్తం 10,867 పరుగులు చేశాడు. ధావన్ రిటైర్మెంట్ న్యూస్‌ను ఆగస్టు 24న ఉదయం ఎక్స్ పోర్టల్‌లో, ఒక వీడియోలో వెల్లడించాడు. "భారత్‌కు ఆడాలన్నది నా ఏకైక కల, అది నిజమైంది. అందుకు నేను చాలా మందికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నా కుటుంబం, చిన్ననాటి కోచ్ తారక్ సిన్హా, మదన్ శర్మ దగ్గర క్రికెట్ నేర్చుకున్నాను. భారత క్రికెట్ జట్టు నాకు ఒక ఫ్యామిలీగా మారింది. టీమ్‌లో మంచి పేరు సంపాదించుకున్నాను, అందరి ప్రేమను పొందాను" అని వీడియోలో వివరించాడు. తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడానికి కెరీర్‌కు వీడ్కోలు పలకడం తప్పనిసరి అని ధావన్ చెప్పాడు. తన క్రికెట్ జర్నీకి సపోర్ట్ చేసిన బీసీసీఐ, ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్, ఫ్యాన్స్‌ను ధన్యవాదాలు తెలిపాడు. అయితే ఇంటర్నేషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఈ వెటరన్ బ్యాటర్, ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కొనసాగే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. అగ్రెసివ్ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటింగ్‌తో 'గబ్బర్'గా గుర్తింపు తెచ్చుకున్న శిఖర్ ధావన్.. 167 వన్డేల్లో 6793 పరుగులు, 34 టెస్టుల్లో 2315 పరుగులు చేశాడు. 68 టీ20ల్లో 1759 రన్స్ సాధించాడు. వన్డేల్లో 17, టెస్టుల్లో 7 సెంచరీలు చేశాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఇకపోతే శిఖర్ ధావన్ టీమిండియా తరఫున 34 టెస్టులలో 2315 రన్స్, 167 వన్డేలలో 6793 రన్స్, 68 టీ20 లలో 1759 రన్స్ సాధించాడు. తాజాగా ముగిసిన ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్ గా ఉన్న శిఖర్ ధావన్.. రెండు మ్యాచులు మాత్రమే ఆడాడు. భుజం గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. ధావన్ స్థానంలో సామ్ కరన్‌కు కెప్టెన్సీ చేసాడు. గాయం నుంచి కోలుకున్నా ధావన్ ను పక్కన పెట్టింది మేనేజ్మెంట్. 222 ఐపీఎల్ మ్యాచులు ఆడిన ధావన్ 6768 రన్స్ చేశాడు. ధావన్ కెరీర్ లో మొత్తంగా 17 వన్డే సెంచరీలు.., 7 టెస్ట్ సెంచరీలు సాధించాడు. టెస్టుల్లో 190 అత్యధిక స్కోరు. వన్డేలో 143. టీ20 ల్లో ఒక్క సెంచరీ కూడా నమోదు చేయలేదు. ఇక ఐపీఎల్ లో 2 సెంచరీలు చేసాడు. ఇకపోతే అంతర్జాతీయ క్రికెట్?లో 10887 పరుగులు చేయగా.. ఐపీఎల్ లో 6769 పరుగులు చేసాడు. ధావన్ పై ఉన్న రికార్డ్స్ చూస్తే..– 2013లో భారత్ తరఫున అత్యధిక పరుగులు.– 2015 ప్రపంచకప్ లో భారత్ తరఫున అత్యధిక పరుగులు. – 2017లో భారత్ తరఫున అత్యధిక పరుగులు.– 2018 ఆసియా కప్ లో భారత్ కు అత్యధిక పరుగులు– తొలి టెస్టులో శతకం (187).– 100వ మ్యాచ్లో శతకం – కెరీర్లో అత్యధిక 90లు (7%ష్ర)%– వేగవంతమైన 6000 పరుగులు – ఐపీఎల్లో బ్యాక్–టు–బ్యాక్ సెంచరీలు సాధించిన మొదటి వ్యక్తి.

# మరోసారి తండ్రి కానున్న రోహిత్..?



ప్రస్తుతం టీమిండియా జట్టుకు క్రికెట్ నుండి సుదీర్ఘ విరామం లభించింది. ఈ సమయంలో ప్రతి ఒక్క టీమిండియా క్రికెట్ ఆటగాడు వారి కుటుంబంతో సరదాగా సమయాన్ని గడుపుతున్నారు. ఇకపోతే టీ20 గెలిచిన తర్వాత రోహిత్ శర్మ టీ20 ఫార్మేట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. ఇక తాజాగా ముగిసిన శ్రీలంక టూర్లో రోహిత్ శర్మ వన్డేలకు మాత్రమే కెప్టెన్ గా వ్యవహరించాడు. తర్వాత బంగ్లాదేశ్ సిరీస్ లో అతడు ఆడనున్నాడు. ప్రస్తుతం లాంగ్ బ్రేక్ దొరకడంతో ఆయన వివిధ కార్యక్రమాలకు హాజరవుతున్నాడు. ఇదే క్రమంలో తాజాగా రోహిత్ శర్మ తన భార్య రితికతో కలిసి %జజూగా% క్రికెట్ రేటింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రస్తుతం ఈవెంట్ సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ఈ ఈవెంట్ లో రోహిత్ శర్మ భార్య రితికను చూసిన సోషల్ మీడియా వినియోగదారులు.. రితిక మళ్లీ కడుపుతో ఉన్నట్లు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె చిన్నపాటి బేబీ బంప్ తో ఉన్నట్లు ఈ వీడియోలో కనబడుతుంది. అయితే ఈ విషయం రోహిత్ శర్మ నేరుగా స్పందిస్తే తప్ప.. అది నిజమా..? అబద్ధమా..? అన్న విషయం తెలుస్తుంది. ఇక ఈ వీడియో చూసిన సోషల్ మీడియా వినియోగదారులు.. అతి త్వరలోనే రోహిత్ జోడి జూనియర్ హిట్ మ్యాన్ కు జన్మ ఇవ్వబోతున్నట్లు కామెంట్ చేస్తున్నారు. రోహిత్ 2015లో రితిక ను వివాహం చేసుకోగా.. 2022 లో కూతురు సమైరా పుట్టింది.


GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేల్చడం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రచారంపొందుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్ని జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

# కల్కి-2లో ప్రభాస్‌ను మరింత బెస్ట్‌గా చూపిస్తాం

## - అర్షద్ వార్సీ వ్యాఖ్యలకు స్పందించిన నాగ్ అశ్విన్



బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ వ్యాఖ్యలపై కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. 'కల్కి' సినిమాలో ఓ సన్నివేశాన్ని పోస్ట్ చేసిన నెటిజన్.. ఈ ఒక్క సీన్ బాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తంతో సమానం అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై నాగ్‌అశ్విన్ స్పందిస్తూ.. టాలీవుడ్, బాలీవుడ్ అని విడదీసి మాట్లాడొద్దన్నారు.'నార్త్-సౌత్, టాలీవుడ్ వెర్సస్ బాలీవుడ్.. ఇలా పోలుస్తూ వెనక్కి వెళ్లొద్దు. మనమందరం ఒక ఇండస్ట్రీకి చెందినవాళ్లమే. అర్షద్ కొంచెం హుందాగా మాట్లాడాల్సింది. అయినా ఫర్వాలేదు. మేము అతడి పిల్లల కోసం 'కల్కి' బుజ్జి బొమ్మలు పంపిస్తాం. కల్కి రెండోభాగం కోసం మరింత కష్టపడి పనిచేస్తాను. అందులో ప్రభాస్‌ను బెస్ట్‌గా చూపిస్తాను అని రాసుకొచ్చారు. ప్రపంచంలో చాలామంది మనల్ని ద్వేషిస్తారు. కానీ, మనం వాటిని పట్టించుకోకుండా ముందుకెళ్లాలి అని నాగ్‌అశ్విన్ చెప్పారు. ప్రభాస్ కూడా ఇదే మాట అంటుంటారని ఆయన తెలిపారు. మరోవైపు ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన కామెంట్స్ తీవ్ర చర్చనీయాంశం గా మారుతున్నాయి. వీటిని ఖండిస్తూ పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాజాగా ఈ అంశంపై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు బాలీవుడ్ మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు లేఖ రాశారు. అభిప్రాయాల్ని వ్యక్తపరిచే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, అర్షద్ చేసిన వ్యాఖ్యలు ప్రభాస్‌ని తక్కువ చేసేలా, వ్యతిరేకతకు కారణమయ్యేలా ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆయనకు సూచనలు చేస్తారని ఆశిస్తున్నాం. ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా నటీనటులంతా గౌరవంగా ఉండాలని కోరుతున్నాం. మనమంతా ఒకే కుటుంబంలో భాగమని గుర్తుంచుకోవాలి. ఈ ఐక్యతని కాపాడుకుందాం అంటూ అసోసియేషన్ అధ్యక్షురాలు పూనమ్ థిల్లాన్‌కు రాసిన లేఖలో విష్ణు పేర్కొన్నారు.

# నిర్మాత అశ్వినీదత్‌కు చిరు కానుక

## - అరుదైన శంఖం అందించిన మెగాస్టార్



ప్రముఖ నిర్మాత అశ్వనీదత్‌కు అగ్ర కథానాయకుడు చిరంజీవి విలువైన కానుక అందజేశారు. 'ఇంద్ర' రీ రిలీజ్ ను పురస్కరించుకుని ఆ చిత్రబృందాన్ని శుక్రవారం చిరు కలిశారు. నిర్మాత అశ్వనీదత్, దర్శకుడు బి.గోపాల్, సంగీత దర్శకుడు మణిశర్మ, సినీ రచయితలు పరుచూరి గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, చిన్నికృష్ణలను ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. ఆ సినిమా విశేషాలను నెమరువేసుకున్నారు.ఇందులో భాగంగా అశ్వనీదత్‌కు ఒక అందమైన శంఖాన్ని బహుమతిగా అందజేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ అశ్వనీదత్ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఈ విజయశంఖాన్ని కానుకగా మీరు ఇచ్చారు. కానీ, ఇంద్రుడై, దేవేంద్రుడై దానిని పూరించింది మాత్రం ముమ్మాటికీ మీరే. ఈ కానుక అమూల్యం. ఈ జ్ఞాపకం అపురూపం. అదెప్పటికీ నా గుండెల్లో పదిలం అని పేర్కొన్నారు. 'ఇంద్ర' టీమ్‌ను కలవడంపై చిరు ఆసక్తికర ట్వీట్ చేశారు. 'ఇంద్ర' క్రియేట్ చేసిన సునామీ గుర్తుచేస్తూ 22 సంవత్సరాల తర్వాత మరోసారి థియేటర్లలో రిలీజైన సందర్భంగా చిరు సత్కారం. సినిమా మేకింగ్ విశేషాలను నెమరు వేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇంద్ర' సినిమా నా జీవితంలో ఎంతో ముఖ్యమైనది. కాలం మారిపోతుంది. తరాలు మారిపోతాయి. ఒక్కరు మాత్రమే కాలానికి ఎదురీది.. తరాలను దాటి.. శాశ్వతంగా నిలిచి పోరాటం చేస్తారు. అలాంటి వ్యక్తే మెగాస్టార్ చిరంజీవి. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని నిర్మించడం నా అదృష్టం. థాంక్యూ చిరు. త్వరలో మీతో ఐదో చిత్రం కూడా నిర్మిస్తా అని మాటిస్తున్నా అని ఇటీవల 'ఇంద్ర' రీ రిలీజ్‌ను ఉద్దేశించి అశ్వనీదత్ పేర్కొన్నారు. చిరంజీవి – అశ్వనీదత్ కాంబినేషన్‌లో ఇప్పటివరకూ నాలుగు చిత్రాలు తెరకెక్కాయి. ఈ కాంబోలో తెరకెక్కిన తొలి చిత్రం 'జగదేక వీరుడు అతిలోక సుందరి' ఎన్నో రికార్డులను బ్రేక్ చేసింది. ఎవర్‌గ్రీన్ క్లాసిక్ మూవీగా గుర్తింపు సొంతం చేసుకుంది. చిరు హీరోగా నటించిన 'చూడాలని వుంది', 'ఇంద్ర', 'జై చిరంజీవ'లను అశ్వనీదత్ నిర్మించారు.

# ఆగ్రా సన్నివేశాలు వైరల్

## - సోషల్ మీడియా కామెంట్స్‌పై నొచ్చుకున్న రుహానీ శర్మ



రుహానీ శర్మ నటించిన 'ఆగ్రా'లోని కొన్ని సన్నివేశాలు నెట్టింట వైరల్ కావడంపె ఆమె అసహనం వ్యక్తంచేశారు. ఈ సినిమా కథ ఎన్నో అవార్డులను గెలుచుకుందని.. దాన్ని పట్టించుకోకుండా తన సన్నివేశాలను వైరల్ చేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రుహానీ నటించిన 'ఆగ్రా' గతేడాది విడుదలైంది. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి వచ్చింది. దీంతో కొందరు ఇందులోని బోల్డ్ సన్నివేశాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. రుహానీ ప్రైవేట్ వీడియోస్ అంటూ వాటిని వైరల్ చేస్తున్నారు. దీనిపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ లేఖను విడుదల చేశారు. ఆగ్రా'లోని సన్నివేశాలు లీక్ అయినప్పటినుంచి నేను ఎంతో నిరుత్సాహంగా ఉన్నాను. నా బాధను వివరించడానికి నిరుత్సాహం అనేది కూడా చిన్నమాటే. మా కష్టాన్ని, అంకితభావాన్ని విస్మరించి కేవలం కొన్ని సన్నివేశాలను మాత్రమే వైరల్ చేయడం హృదయవిదారకంగా ఉంది. కళాత్మక చిత్రాలను రూపొందించడం ఎంతో పెద్ద సవాలు. వాటి కోసం నిద్ర లేని రాత్రులు గడపాలి. అలాంటి చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి రక్తాన్ని చెమటగా మార్చాలి. కన్నీళ్లను అర్థం చేసుకోకుండా కొందరు దాని గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. కొన్ని సన్నివేశాల ఆధారంగా సినిమాపై ఓ నిర్ణయానికి రాకూడదు. అది సరైన పద్ధతి కాదు. ఈ చిత్రాన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2023లో ప్రదర్శించారు. చిత్ర బృందానికి దక్కిన గౌరవం అది. ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఇంత గొప్ప ప్రాజెక్ట్‌లో వర్క్ చేసినందుకు నాకెంతో గర్వంగా ఉంది. ఈ సినిమా శైలిని అందరూ గుర్తించాలని కోరుతున్నాను. కళ ఎప్పుడూ సులభంగా, సౌకర్యవంతంగా ఉండదు. ఎన్నో భావోద్వేగాలతో ముడిపడి ఉంటుంది. కళాకారుల శ్రమను వృథా చేయకండి. సినిమా గొప్పతనాన్ని అర్థం చేసుకోండి' అని ఆ లేఖలో పేర్కొన్నారు.










## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాఘవ లారెన్స్

కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని కోలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ సమయంలో స్వామివారి సేవలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకునాడు. ఇక లారెన్స్‌కు టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అయితే తిరుమలకు వచ్చిన లారెన్స్‌ను చూసిన అభిమానులు భక్తులు సెల్ఫీల కోసం పోటీ పడ్డారు.సినిమాల విషయానికి వస్తే.. లారెన్స్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం కాంచన 4. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీలో ముని, కాంచన 2, కాంచన 3 చిత్రాలు వచ్చి మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు తాజాగా ఈ ఫ్రాంచైజీ నుంచి కాంచన 4ను అనౌన్స్ చేశారు రాఘవ లారెన్స్. ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు. ఈ మూవీలో కథానాయికగా సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2025 సమ్మర్‌లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు.

Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written